సాగులో రైతులు తలమునకలు

- పత్తి, వరి పంటలపైనే దృష్టి
- వర్షం లేకున్నా స్ప్రింక్లర్లతో పత్తి మొలకలకు తడులు
- ఇతర పంటలపై కనిపించని ఆసక్తి



ఉప్పునుంతల సమీపంలో పత్తి విత్తనాలు నాటుకుంటున్న రైతులు

ఉప్పునుంతల: గతేడాది ముందుగా విత్తుకున్న పత్తి పంట దిగుబడి బాగా రావడం, ప్రస్తుతం అదును కార్తెలు దాటుతుండటంతో మండలంలో రైతులు వానాకాలం పంటల సాగులో పూర్తిగా నిమగ్న మయ్యారు. వర్షం కోసం ఎదురుచూడకుండా పొలాల్లో ఎక్కడ చూసినా పత్తి విత్తనాలు నాటుతూ కనిపిస్తున్నారు. విత్తనాలు నాటిన తర్వాత స్ప్రింక్లర్లతో పొలాలను తడుపుతున్నారు. కొంత మంది రైతులు పంటల సాగు కోసం పొలాలను సిద్ధం చేస్తున్నారు. వరినారు మళ్లను తయారు చేసుకుంటు న్నారు. కొంత మంది రైతులు ఇప్పటికే వరి నారు పోసుకున్నారు. ఈ ఏడాది మెట్ట పంటల్లో ప్రధానంగా పత్తి పంట సాగుపైనే రైతులు ప్రత్యేక దృష్టిపెట్టారు. జొన్న, మొక్కజొన్న, ఇతర పంటల సాగు ఏమాత్రం కన్పించడం లేదు. సకాలంలో వర్షాలు పడకున్నా రైతులు బోరుబావుల్లో నీరు పుష్కలంగా ఉండటంతో వర్షం పడేంత వరకు తడులు ఇవ్వొచ్చనే ధైర్యంతో విత్తనాలు నాటుకుంటున్నారు. ఇప్పటికే నెల రోజుల కిందట పత్తి విత్తనాలు నాటుకున్న రైతులు వరుస తడులు ఇస్తుండటంతో పత్తి మొక్కలకు గుంటుక తోలే వరకు వచ్చాయి. పొలాలు తక్కువగా ఉన్న వారు ముందుగా పత్తిని సాగుచేసి వాతావరణం అనుకూలిస్తే అదే పొలంలో యాసంగి పంటగా వేరుశనగను సాగుచేసుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఇప్పటికే 50శాతం మంది రైతులు పత్తి విత్తనాలను నాటుకున్నారు. వ్యవసాయాధికారుల అంచనా మేరకు మండలంలో ఈ ఏడాది వానాకాలం పంటగా పత్తి 28 వేల ఎకరాల్లో, 3 వేల ఎకరాల్లో వరిపంట, మిగతాది మొక్కజొన్న, కంది పంటలను తక్కువ విస్తీర్ణంలో సాగుచేసే అవకాశముందని మండల వ్యవసాయాధికారిణి సునీత తెలియజేశారు. ఈ ప్రాంతంలో ఆముదం పంటను వేసుకోవడానికి రైతులు ఆసక్తి చూపడం లేదు. పంట చేతికందే దశలో ఆముదం పంటకు బూజు తెగులు ఆశించి ఏమాత్రం దిగుబడి రాకపోవడంతో ఆముదం పంట సాగు పూర్తిగా తగ్గిపోయింది. కంది పంటను మొక్కజొన్న, జొన్న, పత్తి పంటల్లో అంతర పంటగా సాగు చేసుకుంటు న్నారు. అక్కడక్కడ రైతులు విడిగా కూడా కందిపంటను సాగుచేయడానికి సన్నద్ధం అవుతున్నారు.

జొన్న, కంది సాగు చేసుకుంటే ప్రయోజనం..

రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా జొన్న, కంది తదితర పంటలను సాగు చేసుకుంటేనే ప్రయోజనం ఉంటుందని వ్యవసాయాధికారులు సూచిస్తు న్నారు. జొన్నరొట్టెకు డిమాండ్ పెరగడం, జొన్నలకు కూడా మంచి గిట్టుబాటు ధర రావడం, పశువుల మేతకు జొన్న చొప్ప అవసరపడుతుందని చెబుతున్నారు. అదేవిధంగ కంది పంటను అంతర పంటగా, విడిగా సాగుచేసుకుని పంట సస్యరక్షణపై శ్రద్ధ తీసుకుంటే అధిక దిగువడి వస్తుందన్నారు. రైతులు తమకున్న పొలంలో అన్ని రకాల పంటలను సాగు చేసుకోవాలని సూచిస్తున్నారు. స్థానిక పీఏసీఎస్‌లో 1010, బీపీటీ వరి విత్తనాలను అందుబాటులో ఉంచగా.. ఆయా గ్రామాల్లో డీలర్ల వద్ద రైతులు పత్తి విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు.

డీలర్ల వద్దనే..



రైతులు గ్రామాల్లో లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి. ప్రభుత్వం ధ్రువీకరించిన కంపెనీలకు చెందిన విత్తనాలను మాత్రమే సాగుచేసుకుంటే ఆశించిన దిగుబడి వస్తుంది. విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్ వద్ద తప్పనిసరిగా రసీదు పొందాలి. తక్కువ ధరకు వస్తున్నాయని నకిలీ విత్తనాలు సాగుచేసుకుంటే పంట దిగుబడి రాక నష్టపోవాల్సి వస్తుంది. రైతులు ఒకే పంటపై పూర్తిగా ఆధారపడకుండా అన్ని రకాల పంటలను సాగు చేసుకోవాలి. రెండు, మూడు వర్షాలు పడిన తర్వాత భూమి చలువకు వచ్చిన తర్వాత విత్తనాలు వేసుకుంటే మొలక శాతం బాగుంటుంది.

– సునీత, వ్యవసాయాధికారిణి, ఉప్పునుంతల

క్లుప్తంగా

వృద్ధులకు అండగా నిలుద్దాం



కల్వకుర్తి రూరల్: వృద్ధాశ్రమంలో జీవనం సాగిస్తున్న వృద్ధులకు సమాజంలోని ప్రతిఒక్కరూ అండగా నిలవాల్సిన అవసం ఉందని లయన్స్ క్లబ్ కార్యదర్శి శ్రీధర్ అన్నారు. శనివారం పట్టణంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కుటుంబ సభ్యులకు దూరమై వృద్ధాశ్రమంలో గడుపుతున్న వారికి సహాయ సహకారాలు అందించడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. వెల్దండకు చెందిన వజ్రలింగం జన్మదినం సందర్భంగా లయన్స్‌క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో భరత్ సహకారంతో కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ కోశాధికారి వెంకటేష్, కిషన్, తర్నికల్ శ్రీనివాస్, శ్రీధర్, భరత్ పాల్గొన్నారు.

ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక ర్యాలీ



లింగాల: మండల కేంద్రంలో శనివారం శ్రామిక వికాస కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవ వారోత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వడ్డెరాయవరం, రాయవరం, క్యాంపురాయవరం గ్రామాల్లో వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. బడిఈడు పిల్లలు బాలకార్మికులుగా మారకుండా పాఠశాలలో చేరాలని ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ తిరుపాల్ కోరారు. కార్యక్రమంలో లింగాల సర్పంచ్ కోనేటి తిర్పతయ్య, భాగ్యమ్మ, మన్సూర్ విద్యార్థులు పాల్గొన్నారు.

ముదిరాజ్ వర్గాన్ని విస్మరించడం తగదు

లింగాల: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు అందిస్తున్న ఆర్థిక సాయం జాబితాలో ముదిరాజ్‌లను విస్మరించడం తగదని ముదిరాజ్ యువజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సలేశ్వరం శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. ప్రభుత్వం బీసీ కులాల వృత్తిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించడం గొప్ప విషయమని, ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో ముదిరాజ్‌లు లేరని ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన అధిక జనాభా కలిగి అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న ముదిరాజ్‌లను బీసీ సంక్షేమ శాఖ ఎందుకు పరిగణలోకి తీసుకోలేదని ప్రశ్నించారు.

వృద్ధులకు బ్రెడ్లు పంపిణీ

కొల్లాపూర్: సినీ నటుడు నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను శనివారం కొల్లాపూర్‌లో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని విశ్వశాంతి వృద్ధాశ్రమంలో బాలకృష్ణ జన్మదిన కేకును కట్‌చేసి వృద్ధులకు పంచిపెట్టారు. బాలకృష్ణ అభిమాన సంఘం నాయకులు బ్రహ్మానందరెడ్డి, విష్ణు, రాముశెట్టి, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలయ్యయాదవ్ తదితరులున్నారు.

క్రీడాకారులకు అండగా ఉంటా..



కల్వకుర్తి రూరల్: క్రీడాకారులకు ఎల్లప్పుడు అండగా నిలుస్తామని ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తాండ్రలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి క్రీడాకారుడు తనకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తీరిన లోఓల్టేజీ సమస్య

పెద్దకొత్తపల్లి: మండల పరిధిలోని యాపట్లలో లోఓల్టేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో లోఓల్టేజీ సమస్యలు తీర్చేందుకు ఉపసర్పంచ్ అజయ్ కుమార్ సమస్యను కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కొత్తగా గ్రామానికి మూడు సింగిల్‌ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేయించారు. శనివారం ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయించారు.



ఇసుక టిప్పర్‌ను పట్టుకున్న గ్రామస్తులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

తాడూరు: మండలంలోని మేడిపూర్ దుందుబీ నది నుంచి టిప్పర్ల ద్వారా అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా.. మేడిపూర్ గ్రామస్తులు పట్టుకుని టిప్పర్లను నిలిపివేశారు. మూడు గంటల పాటు టిప్పర్ యాజమానులకు, గ్రామస్తులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. స్థానిక ఎస్‌ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులకు సర్ది చెప్పి ఇసుకతో నింపిన టిప్పర్‌ను తహసీల్దార్ కార్యాలయ ఆవరణకు తరలించారు. వారం రోజుల నుంచి ప్రభుత్వ అభివృద్ధి పథకాల పేరుతో ఇసుక దోపిడీ కొనసాగుతుందని, ఈ విషయమై సంబంధిత అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదన్నారు. నియంత్రించాల్సిన అధికారులే అక్రమంగా ఇసుక తరలించే వారికి సహకరిస్తున్నారని గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు.

పొలాల చుట్టూ ఇసుక డంపులే..

గ్రామంలో కొంత మంది వ్యక్తులు పొలాల చుట్టూ ఇసుక డంపులు వేసుకున్నారని, వాగుల నుంచి ఇసుకను తోడి పొలాల వద్ద డంపులు ఏర్పాటు చేసుకుని రాత్రిళ్లు జేసీబీల ద్వారా ఇసుకను తరలిస్తున్నారన్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా కూడా వారిలో చలనం లేదన్నారు. గ్రామం నుంచి పాలుమూరు వెళ్లే పరిసర ప్రాంతాల్లో ఇసుక నిల్వ చేసుకున్నారు.

చెంచు రైతులకు విత్తనాలు పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న సమన్వయకర్తలు

అమ్రాబాద్: కోనేరు సంస్థ ఆధ్వర్యంలో శనివారం అమ్రాబాద్ మండలం జంగంరెడ్డిపల్లి, పదర మండలం పెట్రాల్‌చేన్, మద్దిమడుగు గ్రామాల్లో చెంచు రైతులకు పచ్చజొన్న, కందులు, రాగులు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ సమన్వయ కర్తలు మాట్లాడారు. పత్తి, వేరుశనగ, మిర్చి పెట్టుబడి అధికంగా పంటలు వేసి నష్టపోకుండా తక్కువ పెట్టుబడితో ఆరోగ్యకరమైన పంటలు పండించవచ్చని సూచించారు. ఇవే కాకుండా అన్ని రకాల కూరగాయల విత్తనాలు కూడా పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సైదులు, పెద్దులు, ఇస్మాయెల్ తదితరులు ఉన్నారు.

బలహీనవర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



క్షీరాభిషేకం చేస్తున్న కులవృత్తిదారులు

చారకొండ: రాష్ట్రంలో బలహీన వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు బాలేమియా అన్నారు. మండలంలోని జూపల్లిలో కులవృతులకు రూ.లక్ష ఆర్థిక సాయం సీఎం అందించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం అంబేడ్కర్ సర్కిల్‌లో బలహీనవర్గాల కులవృత్తిదారులతో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అన్ని వర్గాలకు లబ్ధి చేకూర్చిన ప్రభుత్వం బీఆర్‌ఎస్ అని అన్నారు. పెద్దయ్య యాదవ్, రాములు యాదవ్, బోజ్జయ్య, తిరుపతయ్య, శ్రీరాములు చేతివృతికులాలవారు ఉన్నారు.

బడుగుల ఆశాజ్యోతి మహేంద్రనాథ్



అచ్చంపేటలో పూలమాల వేసిన ఎంపీ రాములు



తిమ్మాజిపేటలో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మర్రి

అచ్చంపేట రూరల్: బడుగుల ఆశాజ్యోతి మాజీ మంత్రి మహేంద్రనాథ్ అని నాగర్‌కర్నూల్ ఎంపీ పి.రాములు అన్నారు. శనివారం అచ్చంపేటలో మహేంద్రనాథ్ జయంతిని పలు రాజకీయ, సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. మహేంద్రనాథ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ రాములు మాట్లాడారు. మహేంద్రనాథ్ నల్లమల ప్రాంతంలో విద్యాలయాలను నెలకొల్పి విద్యాభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. మహేంద్రనాథ్‌ను ఆదర్శంగా తీసుకుని రాజకీయాల్లోకి వచ్చానన్నారు. అంతకు ముందు డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, బీజేపీ నాయకుడు సతీష్‌మాదిగ మహేంద్రనాథ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, తులసీరాం, రామకృష్ణారెడ్డి, శరణ్‌గౌడ్, అమీనొద్దిన్, నాగయ్యగౌడ్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ రూరల్: స్థానిక జాతీయ ఉన్నత పాఠశాల ఆవరణలో పేదల పెన్నిధి, బడుగు బలహీన వర్గాల విద్యాదాత మాజీ మంత్రి పుట్టపాగ మహేంద్రనాథ్ 97వ జయంతి కార్యక్రమాన్ని శనివారం మహేంద్రనాథ్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు వంకేశ్వరం శ్రీనివాసులు, కొత్తపరశురాములు, మహేంద్రనాథ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు గంగాధర్, వెంకటస్వామి, భాస్కర్, వెంకటస్వామి, నిరంజన్, వంకేశ్వరం నిరంజన్, శివశంకర్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

కందనూలు: మాజీ మంత్రి మహేంద్రనాథ్ జయంతిని పురస్కరించుకొని శనివారం తిమ్మాజిపేట మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మహేంద్రనాథ్ తన జీవితకాలం అంతా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికే కృషి చేశారని కొనియాడారు. అనంతరం బిజినేపల్లి మండలంలోని పలు గ్రామాల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

అమ్రాబాద్: మండల కేంద్రంలో కుక్కలు అధికమై స్వైర విహారం చేస్తున్నాయి. మండలంలోని తెలుగుపల్లికి చెందిన గుండాల మధు శనివారం అమ్రాబాద్‌కు వచ్చి తన పని ముగించుకొని తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ప్రధాన రోడ్డు వెంట ఉన్న కుక్కలు అతనిపై దాడి చేశాయి. దీంతో అతని శరీరం, కడుపునకు గాయాలయ్యాయి. కుక్కలు అధికమై కరవడంతో పాటు రాత్రుళ్లు వాటి అరుపులకు నిద్ర కూడా రావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

కేటీఆర్‌ను కలిసిన యూత్ వింగ్ అధ్యక్షుడు



వెల్దండ: టీఆర్‌ఎస్వీ యూత్‌వింగ్ మండల అధ్యక్షుడు, సోషల్ మీడియా కన్వీనర్ యాదగిరి శనివారం హైదరాబాద్‌లో ఐటీశాఖ మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ బలోపేతానికి యువకులు కృషి చేయాలన్నారు. సోషల్ మీడియాలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



పూజలు చేస్తున్న దాత కుటుంబ సభ్యులు

అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర దేవాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి దాతలు సహకరిస్తున్నారని ఆలయ కమిటీ చైర్మన్ కందూరి సుధాకర్ తెలిపారు. శనివారం నల్లగొండ జిల్లా డిండికి చెందిన వాడకట్టు మనోహర్ జ్ఞాపకార్థకంగా కుటుంబ సభ్యులు నిత్యాన్నదానానికి రూ.25,116లు అందజేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు రాజేశ్వరి, సాయివికాస్, ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి..

కోడేరు: మండలంలోని నర్సాయిపల్లిలో గంగమ్మ ఆలయ నిర్మాణానికి బావాయిపల్లి మాజీ సర్పంచ్ ఎన్‌వీ ఫౌండేషన్ చైర్మన్ నక్క వేణుగోపాల్ యాదవ్ శనివారం రూ.50 వేల విరాళం అందజేశారు. దీంతో గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ మహాసభ వాల్‌పోస్టర్లు విడుదల



అమ్రాబాద్: ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలు మరో పోరాటానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొయ్యల వెంకటేష్ అన్నారు. శనివారం అంబేడ్కర్ చౌరస్తాలో పాలమూరు ఎమ్మార్పీఎస్ మహాసభ కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 12 ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఉమ్మడి పాలమూరు స్థాయి మహాసభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సభకు మందకృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో అణ్వేష్, ఆధీష్, మహేష్ తదితరులు ఉన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



మన్ననూర్‌లో పాలాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

కొల్లాపూర్: దివ్యాంగుల పింఛన్ల పెంపుపై బీఆర్‌ఎస్ నాయకులు హర్షం ప్రకటించారు. వారు శనివారం కొల్లాపూర్‌లోని ఎన్టీఆర్ చౌరస్తాలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారన్నారు. నరేందర్‌రెడ్డి, సాంబశివుడు యాదవ్, రుక్మద్దీన్, ఎల్లగౌడ్, హరికృష్ణ, అజ్మత్ తదితరులున్నారు.

మన్ననూర్: శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి అంబేడ్కర్ కూడలిలో దివ్యాంగులు కేసీఆర్ చిత్రపటానికి శనివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడారు. ఇప్పటికే దివ్యాంగులకు నెలకు రూ.3,016 ఆసరా పింఛన్ ఇస్తున్న ప్రభుత్వం మరో రూ.వెయ్యి పెంచుతూ వచ్చే నెల నుంచి రూ.4,016 ఇచ్చేలా సీఎం కేసీఆర్ ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు.

చారకొండ: సీఎం కేసీఆర్ దివ్యాంగులకు పింఛన్ మరో రూ.వెయ్యి పెంచుతూ ప్రకటించడంపై మండలంలోని దివ్యాంగులు జూపల్లిలో సీఎం చిత్రాపటాన్ని ఏర్పాటు చేసి క్షీరాభిషేకం చేశారు. వెంకటయ్య, శేఖర్, సిరాజ్ ,రామస్వామి, రాములు, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

పింఛన్ పెంపుపై హర్షం

తెలకపల్లి: సీఎం కేసీఆర్ దివ్యాంగులకు పింఛన్ పెంచడంపై దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు శ్యాంసుందర్ శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

చెక్కు అందజేత



వెల్దండ: మండల పరిధిలోని బద్రిగానితండాకు చెందిన కేతావత్ మల్లేష్‌కు ప్రభుత్వం మంజూరు చేసిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును శనివారం ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ బాధిత కుటుంబానికి అందజేశారు. అనారోగ్యానికి గురైన మల్లేష్ సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నాడు. పేద కుటుంబం కావడంతో ఎమ్మెల్యే సహకారంతో రూ.60 వేలు మంజూరయ్యాయి. ప్రభుత్వం మంజూరు చేసిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే బాధిత కుటుంబానికి అందజేశారు. వెంకటయ్యగౌడ్, లచ్చిరాంనాయక్, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సుపరిపాలన దినోత్సవం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన

కందనూలు: రాష్ట్ర అవతరణ ఉత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో సుపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన మాట్లాడారు. రాష్ట్రంలో పండుగల దశాబ్ది ఉత్సవాలు జరుపుకోవడం జరుగుతుందన్నారు. రైతులు యువకులు మహిళలు చిన్నపిల్లలు సైతం వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారని పేర్కొన్నారు. అనంతరం సహ పంక్తి భోజనాలు చేశారు. మున్సిపల్ కమిషనర్ జయంత్ కుమార్ రెడ్డి, వైస్ చైర్మన్ బాబురావు, మేనేజర్ యాదయ్యతో పాటు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

వెల్దండ: దేశ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రధాని నరేంద్రమోదీ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కల్వకుర్తి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ యెన్నం శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం వెల్దండలో విలేకరులతో మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ 9 ఏళ్ల పరిపాలనలో అనేక పథకాలను పేదల కోసం అమలు చేసినట్లు చెప్పారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రధాని కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ నెల 1 నుంచి 22వ తేదీ వరకు పార్లమెంట్ స్థాయిలో సంక్షేమ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ స్థాయిలో మూడు సమావేశాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 6న ఆమనగల్లు పట్టణంలో అసెంబ్లీ స్థాయిలో సమావేశం నిర్వహించినట్లు పేర్కొన్నారు. 16న విశిష్ట వ్యక్తుల సమావేశం, నియోజకవర్గ స్థాయిలో దళిత మోర్చా, యువ మోర్చా, కిసాన్‌మోర్చా, ఎస్టీ మోర్చా, మహిళా మోర్చాతో పాటు 8 మోర్చా సమావేశాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధాని అమలు చేస్తున్న సంక్షేమాలను ఇంటింట చేరేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. మండల స్థాయిలో కార్యకర్తలందరూ సైనికుల్లా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ నెల 21న మండల కేంద్రంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించాలన్నారు. శక్తి కేంద్రాల వారికి సంక్షేమ పథకాలు, బూత్ స్థాయిలో 9ఏళ్లలో అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. తపాలా కార్యాలయం ద్వారా అందిస్తున్న కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు పండించిన పంటలకు 10 శాతం మద్దతు ధరలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో దేశంలో అధిక మెజారీతో బీజేపీని గెలిపించి నరేంద్రమోదీని మరోసారి ప్రధానిగా గెలిపించాలని కోరారు. రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు, వెంకట్‌రెడ్డి, మోహన్ రెడ్డి, శ్రీనివాస్‌చారి, పెద్దయ్య తదితరులు ఉన్నారు.

మిషన్‌భగీరథ నీటిని సరఫరా చేయాలి

కోడేరు: మండల కేంద్రంలోని 4వ వార్డులో మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారం రోజులు కావొస్తున్నా.. తాగునీరు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై అధికారులకు విన్నవించినా లాభం లేకుండా పోయిందని, వేసవి కావడంతో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీటిని వదలాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



పెద్దకొత్తపల్లి: సాతాపూర్ ఉన్నత పాఠశాలలో 2007–8 లో 10వ తరగతి పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులైన గోపాల్‌రావు, కుమార్, కృష్ణకుమార్, గోవిందరెడ్డి, రవికాంతారెడ్డి, నాగేంద్రచారి, చెన్నయ్య, జిలాని, శ్రీలత, బీరయ్య, కురుమయ్య, నాగేశయ్యలను విద్యార్థులు పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో శివశంకర్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గట్టురాయిపాకులలో ఆదర్శ వివాహం



తెలకపల్లి: మండల పరిధిలోని గట్టురాయిపాకులలో శనివారం ఆలేటి శివుడు, విమల ఆదర్శ వివాహం చేసుకున్నారు. హిందూ సంప్రదాయబద్ధంగా కాకుండా భారత రాజ్యాంగం సాక్షిగా పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. న్యాయవాది బోనాసి రాంచందర్, బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ కొత్తపల్లి కుమార్, అంతటి నాగన్న ఆధ్వర్యంలో రాజ్యాంగం సాక్షిగా ఎలాంటి మంత్రాలు లేకుండా వివాహం చేసుకున్నారు.

బాలలను బడిలో చేర్పించాలి

అచ్చంపేట రూరల్: విద్య బాలల హక్కు అని, బడి బయటి బాలలను బడిలో చేర్పించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక చైర్మన్ లక్ష్మణరావు అన్నారు. శనివారం అచ్చంపేటలో శ్రీజ ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ మొదటి వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. శ్రీజ ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా ఆంగ్లం, కంప్యూటర్ విద్యపై శిక్షణ నిర్వహించడం గర్వంగా ఉందన్నారు.

ప్రమాదకరంగా ఆర్‌అండ్‌బీ రోడ్లు



గోవిందాయిపల్లి వద్ద ప్రమాదకరంగా గుంత

తాడూరు: మండలంలోని ఆయా గ్రామాలను కలిపే ఆర్‌అండ్‌బీ రోడ్లు గతేడాది కురిసిన భారీ వర్షాలకు రోడ్డు పక్కన ఉన్న మట్టి కొట్టుకుపోయి గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. ఏడాది గడిచినా అధికారులు పట్టించుకోకపోవడంతో పెను ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆయా గ్రామాల ప్రయాణికులు వాపోతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. మండలంలోని అంతారం, ఎటిదార్‌పల్లి మీదుగా ఐతోల్ వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు గోవిందాయిపల్లి సమీపంలో కల్వర్టు వద్ద భారీ వర్షాలకు మట్టి కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది. ఏడాది గడిచినా తాత్కాలిక మరమ్మతు కూడా చేపట్టలేదు. అదే విధంగా బలాన్‌పల్లి నుంచి పాపగల్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన మట్టి కొట్టుకుపోయి ప్రమాదభరితంగా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో పాటు పైపై కేబుల్ కోసం కాంట్రాక్టర్లు అక్కడక్కడ తవ్విన గుంతలు పూడ్చకపోవడంతో ఏ ప్రమాదం ఎప్పుడు జరుగుతుందో తెలియక ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా రోడ్లను పరిశీలించి తాత్కాలిక మరమ్మతు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రయాణికులు కోరుతున్నారు.



ఐతోల్ సమీపంలో కల్వర్టు వద్ద..